/

सहकार संरक्षण समिति
సహకార సంరక్షణ సమితి
**Co-operative Movement Protection Council**
STATE CONVENING COMMITTEE, ANDHRA PRADESH
H. No :1-10-134/11(3), Mayur Marg, Begumpet, Hyderabad - 500 016. A.P., Ph : 27768911., 9246179533

**శ్రీయుతులు డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారికి,** తేది: ..............................
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఆర్యా!

**విషయం: రైతుల సంక్షేమదిశలో తొలి అడుగు ఓ ముందడుగు- సంస్కరణలకు 'మానవీయ'తను కల్గించే 'సహకారవిధానం' పటిష్ఠతే ఏకైక మార్గము - సహకారసంరక్షణ సమితి - విజ్ఞప్తి.**

అభినందనలు

రైతు సంక్షేమము, గ్రామీణ ఆర్థికవ్యవస్థ పటిష్ఠత ధ్యేయముతో రాష్ట్రప్రభుత్వ పగ్గాలు చేపట్టిన మీ పరిపాలన ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నాము. రైతులను, వ్యవసాయమును మరియు చేతివృత్తిదారులను సంక్షోభములో నెట్టిన గత ప్రభుత్వ విధానాలను సమీక్షించడముతో పాటు, నిలుపుదల చేయడము పట్ల మొత్తం రైతాంగము, మరియు గ్రామీణ చేతివృత్తిదారులు హర్షము ప్రకటిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు, చేతివృత్తిదారులు తమ "జీవనాధారాల" ఉనికిని కాపాడుకోవచ్చనే ఆశలు వారిలో చిగురించాయి. "సహకారసంరక్షణనము" రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ మరొక్కమారు మీకు హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తుంది.

## "సహకార సంరక్షణ సమితి" (Co-Operative Movement Protection Council)

"సహకార సంరక్షణ సమితి" సహకార భావనపై విశ్వాసము మరియు నిబద్ధత కలిగిన సహకారవేత్తల, సహకార నాయకుల అసోసియేషన్. ఇది సహకార సంస్థలకు మరియు, సహకార నాయకులకు ఒక వేదిక (Forum) సహకార సంస్థల / సహకార ఉద్యమ సంరక్షణకు మరియు అభివృద్ధికి "సహకార సంరక్షణ సమితి" కృషిచేస్తున్నది.

## వినియోగదారుల వ్యవస్థ, సహకారవ్యవస్థ

రైతులు, చేతివృత్తిదారులు మరియు వ్యవసాయకూలీలు మొదలగువారు గ్రామీణ ఆర్థికవ్యవస్థలో 90 శాతంగా ఉండి, వీరు పూర్తిగా "వినియోగదారుల" వర్గంలోనికి వస్తారు. వీరి వినియోగ అవసరం పరపతి, మార్కెటింగ్, ఉపాధి కల్పించుకోవడము. తన ఉత్పత్తులను తానే మార్కెటింగ్ చేసుకోవడము ద్వారా గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తాడు. ఈ ప్రక్రియ సాధనకు ఉన్న వ్యవస్థే "సహకారవిధానము". వీరి వినియోగ అవసరాన్ని బట్టి వారు ఆ రకమైన "సహకారసంఘం"ను ఏర్పరచుకొనుటకు ప్రజా ప్రభుత్వాలు ప్రోత్సహించడమే కాకుండా వాటి అభివృద్ధికి ఆర్థిక చేయూతనిచ్చి పోషించాయి. తద్వారా నేడు గ్రామస్థాయినుండి జాతీయస్థాయివరకు బలమైన సహకారసంస్థల "నెట్‌వర్క్" ఏర్పడింది. ఎన్నో బలహీనతలు ఉన్నప్పటికినీ చేతివృత్తిదారులు, బలహీనవర్గాలు ఆర్థికంగా, సాంఘికంగా అభివృద్ధిచెందుటకు ఈ సహకారసంస్థలు దోహదపడినాయి.

**మహాత్మాగాంధీ: "సహకారవిధానము భారతదేశమునకు ఒక వరము. సహకార విధానము బలహీనుని రక్షణ కవచమే కాని బలవంతుని ఆయుధము కాదు. సహకార సేద్యానికి పూనుకుంటే గాని వ్యవసాయము వల్ల పూర్తిగా లాభము పొందలేమని నా నిశ్చితాభిప్రాయమని" పేర్కొన్నారు.**

**పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ : "నా దృక్పథం భారతదేశంలో సహకారోద్యమ సంచలనమును తెచ్చుట, లేదా, సహకారమును పుంజీవింపజేయుట; స్థూలంగా చెప్పినపుడు, భారతీయ ప్రాథమిక చైతన్యము ప్రతి గ్రామములోను తెచ్చి, చివరకు భారతీయ దృక్పథములో సహకార విధానమునే ప్రస్ఫుటింపజేయుట" అని పేర్కొన్నారు.**

Contd...2

Scanned by CamScanner

**శ్రీమతి ఇందిరాగాంధీ: "సహకారోద్యమము వంటి శక్తివంతము, అప్రతిహతము, సంఘశక్తి ప్రపూరితము అయిన సాధనము వేరొకటి లేదు. ప్రజలు స్వయం సహాయము చేసుకొనుటకిది తోడ్పడును. వారి వ్యక్తిత్వమునకు కాని, కార్యశీలతకు కాని భంగము వాటిల్లకుండ కావలసిన ప్రోత్సాహమును, ఉపాధులను కల్పించును. ఆర్థిక కేంద్రీకరణ దుష్పలితములను తల ఎత్తనీయక హెచ్చుస్థాయిలో ఫలితములను సాధించగల సాధనము ఇది ఒక్కటే" అన్నారు.**

తమరు సహకారసంస్థలను మూసివేయడాన్ని నిలుపుదల చేయడము జాతిపిత మహాత్మాగాంధీ, పండిత నెహ్రూ, శ్రీమతి ఇందిరాగాంధీల భావాలను ఆదరించినట్లైనది. రైతు సంక్షేమదిశలో ఈ తొలి అడుగు ఓ ముందడుగు, కాగా ఈ పోటీ ప్రపంచంలో సహకారసంస్థలు నిలదొక్కుకోవడానికి, రైతులు చురుకైన భాగస్వాములుగా సంస్థలను నిర్వహింపబడుటకు సంస్కరణల ఆవశ్యకము ఉంది.

## ఆర్థిక సరళీకరణకు, సంస్కరణలకు తప్పుడు భాష్యం అన్వయింపే నేటి గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిస్థితి:

"లైసెన్స్ రాజ్‌వ్యవస్థ" స్థానములో ప్రజల సృజనాత్మకతను పెంచి, పోషించి అన్ని రంగాలలో ప్రజలను పాల్గొనింపచేయడం, తద్వారా సామాజిక ఆర్థిక అభివృద్ధిలో వారిని భాగస్వామిని చేయడం, ఆర్థిక సరళీకరణముఖ్య ఉద్దేశం. ఈ లక్ష్యసాధనకు విధానపరంగా సంస్కరణలు అనివార్యము అవుతున్నాయి.

ఈ సంస్కరణలు కూడా భారత రాజ్యాంగ పీఠిక లక్ష్యాల అమలుకు లోబడి ఉండటం తప్పనిసరి.

మనది అభివృద్ధి చెందుతున్న దేశం. ఈ స్వభావమును కాదని, అభివృద్ధిచెందిన దేశాల స్వభావమును ఆపాదించుకొని, నేలవిడిచి, ప్రజాప్రభుత్వాల ప్రాధాన్యతను కుంచింపచేయు దిశలో ప్రయాణించడమే కాకుండా, నేటి భారత ఆర్థికవ్యవస్థలో పెట్టుబడిదారుడు, వినియోగదారుడు అయిన ఈ రెండుపక్షాలలో, పెట్టుబడిదారుని పక్షాన ప్రభుత్వాలు వ్యవహరించడం నేటి ఈ దుస్థితికి కారణం.

నేటి ప్రపంచీకరణ సంధికాలములో 'మార్కెట్' ఎకానమీ ఉప్పెనలాగా రావడము సహజము. ఈ ఉప్పెన నుండీ అభివృద్ధిచెందుతున్న దేశాల ప్రజలు రక్షింపబడాలంటే, ఆ ప్రభుత్వాలు ఆ ప్రజల వినియోగదారుల వ్యవస్థ అయిన "సహకారవ్యవస్థ"కు ఆర్థికచేయూతనివ్వడము అనివార్యము.

ఇందుకు భిన్నంగా, గత ప్రభుత్వాలు, సంస్కరణలు అంటే వినియోగదారుల వ్యవస్థ అయిన సహకారవ్యవస్థను నిర్వీర్యం చేసి ఏకపక్షంగా మార్కెట్ ఎకానమీ శక్తులు ఆ సహకార వ్యాపారరంగంను హస్తగతం చేసుకొనే విధంగా అన్వయించి, విధానాలు అమలుచేశారు.

**ఉదాహరణ:** బ్యాంకింగ్ రంగంలో సంస్కరణల అమలువలన ఆనాడు వాణిజ్యబ్యాంకుల్లో రూ.58 వేల కోట్ల మేరకు నిరర్థక ఆస్తులున్నట్లు తేలింది. ఆదేరకంగా, సహకార బ్యాంకింగ్‌లో రూ.9 వేల కోట్లుగా తేలింది. దీనివలన ఆ బ్యాంకులు అనివార్యంగా మూసివేసే పరిస్థితి ఏర్పడింది. ఈ ఉపద్రవంనుండి రక్షింపబడుటకు వాణిజ్యబ్యాంకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.35 వేల కోట్లపైన ఆర్థికసహాయం చేసి నిలబెట్టాయి. దీనివలన వ్యాపార, పారిశ్రామికరంగాలకు ఆర్థిక చేయూతకు ఎటువంటి ఢోకా లేకుండా అందుతుంది. నేడు అవి లాభాలబాటలో పయనిస్తున్నాయి కూడ.

కాగా, అసంస్కరణకు గురిఅయిన రైతుల, చేతివృత్తిదారుల వ్యవస్థ అయిన సహకారబ్యాంకులకు ఒక పైసాకూడ చేయూత నివ్వకపోవడము వలన సహకారబ్యాంకింగ్ వ్యవస్థను మూసివేసే పరిస్థితిని గత ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా చేశాయి. ఈ కారణంవలన నేడు సహకారబ్యాంకులు వ్యవసాయదారులకు పరపతి ఇవ్వలేకపోతున్నాయి. తద్వారా రైతుల ఆత్మహత్యలు, చేతివృత్తిదారుల ఆకలిచావులు చూస్తూనే ఉన్నాం.

## రాష్ట్రశాసనసభ తీర్మానం:

సంస్కరణల వలన దేశంలోని జిల్లా సహకార కేంద్రబ్యాంకులు, PADBలలో నిరర్థక ఆస్తులు రూ.9 వేల కోట్లని, రిజర్వుబ్యాంకు నియమించిన "కపూర్ కమిటి" తేల్చింది. వాణిజ్యబ్యాంకులకు ఇచ్చిన మాదిరిగానే సహకారబ్యాంకులకు "One Time Assistance" కేంద్రప్రభుత్వం ఇవ్వాలని రాష్ట్ర శాసనసభ తీర్మానాన్ని చేయాల్సిన అవసరం ఉంది. కపూర్ కమిటీ 60:40 పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వాలని సూచించింది. ఈ నివేదిక సమర్పించి నాలుగు సంవత్సరాలు గడచినా సూచనలు అమలుజరగటం లేదు. రాష్ట్రాలలో ఆర్థికపరిస్థితి బలహీనంగా ఉండటమే ఇందుకు కారణం. కాబట్టి, కేంద్ర ప్రభుత్వమే మొత్తం భరించే విధంగా రాష్ట్ర శాసనసభ ద్వారా విజ్ఞప్తి చేయడం సహేతుకము కాగలదని భావిస్తున్నాం. ఒక రాష్ట్రం కోరగానే ఇతర రాష్ట్రాలు కూడా కోరే అవకాశముంది.

## రైతును ఆదుకొనుటకు తక్షణ చర్యలు

**1. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు చేయూత:** పైన పేర్కొన్న ఉపద్రవము అధిగమించడానికి, సెక్షన్ 11 పరిధిలోకి వచ్చిన బ్యాంకు ఒక్కొంటికి రూ.20 కోట్లు వాటాధనంగా సమకూర్చడం ద్వారా నేడు రాష్ట్రంలో 39లక్షల రైతులకు ఇస్తున్న రుణాలను అదనంగా కనీసంగా 20 లక్షల రైతులకు నిజ రుణాలను విరివిగా ఇవ్వవచ్చు.

Contd...3

Scanned by CamScanner

**2. సహకారచట్టం 116సి(1) మార్పడం:** పైన పేర్కొన్న సంస్కరణల ద్వారా ఏర్పడిన ఉపద్రవం మరియు 1989లో రుణవిమోచన పథకం, మరియు PADBలను, DCCBలలో విలీనం చేయడం ద్వారా జిల్లా బ్యాంకులు నష్టాలలోకి నెట్టబడ్డాయి. సహకార వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టేవిధంగా, సమగ్రంగా చర్చించకుండానే సహకార చట్టంలో 116(సి)ని తెచ్చారు. నేడు ఈ సెక్షనును అమలు చేయాలంటే ఉద్యోగులు జీతాలకు అర్హులు కారు. జీతాలు చెల్లిస్తే పాలకవర్గాలను సర్‌ఛార్జి చేసి వారినుండి వసూలు చేయబడాలి. ఈ సెక్షన్ ఖర్చును నియంత్రించే దిశలో కాకుండా వ్యవస్థలో సంక్షోభాన్ని సృష్టించింది. కాబట్టి ఈ సెక్షన్‌ను అమలుని నిలిపివేసి, సమీక్షించి మార్పులు చేయవలసిన అవసరముంది.

**3. జి.ఓ. 331. ఉపసంహరించడం:** పైన పేర్కొన్న పక్షపాత ధోరణితో రైతువ్యవస్థ అయిన సహకారసంస్థలను అక్రమంగా, రాజ్యాంగవిలువలకు, సహకార చట్టానికి భిన్నంగా జి.ఓ. 331 తీసుకువచ్చి, 29 సహకారసంస్థలను ప్రైవేటుపరం చేయ వీలు కల్పించింది. ఈ సంస్థల ఆర్థికపరిస్థితిని, నిర్వహణను సంస్కరించవలసిన ఆవశ్యకత మాత్రము ఎంతైనా ఉన్నది. రైతుసభ్యుల మహాజనసభ ద్వారా ఆ మార్పు చేయవచ్చు. ఈ సంస్థ కొనసాగింపు ఆవశ్యకత పటిష్ఠతపై సహకారనిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించి తద్వారా వాటి మహాజనసభలచే నిర్ణయం చేయించడం, ప్రజాస్వామికం కాగలదు.

**4. PACSలో పరపతేతర వ్యాపారంకు చేయూతనివ్వాలి:** నేడు ప్రాథమిక వ్యవసాయసహకారసంఘాలు (PACS), అంతర్గతంగా ఆర్థికవనరులను సమీకరించుకోవటానికి చట్టం తప్పనిసరి చేసింది. ప్రతిసంఘంలో వినియోగసభ్యుడు ప్రతి సంవత్సరం కనీసంగా రూ.200/- పొదుపు చేయాలి. అనగా, వెయ్యిమంది సభ్యులున్న సంఘం, ప్రతి సంవత్సరం కనీసంగా రూ.2,00,000లు పొదుపు ద్వారా స్వంతవనరులను సమీకరిస్తుంది. ఈ సెక్షన్ హామీద్వారా 'నాబార్డ్'నుండి తక్కువ వడ్డీతో ప్రతి సంఘంకు కనీసం రూ.10లక్షలు పరపతేతర వ్యాపారం కొరకు వర్కింగ్ కాపిటల్ ఇప్పించడానికి ప్రభుత్వం కృషిచేయాలి. తద్వారా పరపతిపై తక్కువ మార్జిన్‌తో రైతుకు రుణం ఇవ్వవచ్చు, మరియు రైతుల ధాన్యంను కొనుగోలు, ఎరువుల అమ్మకం చేయడంద్వారా సంఘాలు ఆర్థిక స్వయంసమృద్ధి చెందుతాయి.

ఈ ప్రాథమిక సంఘాలు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాలకు, మార్క్‌ఫెడ్, ఏజెంట్‌గా వ్యవహరిస్తూ వ్యాపారం చేయవచ్చు. తద్వారా రైతు ఎరువులకు అధికధర చెల్లించనవసరం లేదు. మరియు కల్లంలోనే తన ఉత్పత్తిని తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితిపోతుంది.

**5. 'బి' కంపొనెంటు తిరిగి ప్రవేశపెట్టాలి:** గతంలో రైతులకు బ్యాంకులు రుణాలు సకాలంలో ఇవ్వటం సాధ్యపడలేదు. కాబట్టి అప్పుడు 'బి' కంపొనెంట్స్ ద్వారా ఇచ్చే ఎరువుల మొత్తం దుర్వినియోగం జరిగేది. కాని నేడు కిసాన్ క్రెడిట్ కార్డ్ రావడము మరియు సకాలంలో రుణాలు ఇచ్చే పరిస్థితి ఇప్పుడుంది. కాబట్టి సంఘాలలో 'బి' కంపొనెంట్ ద్వారా ఎరువులు ఇవ్వడం తిరిగి ప్రవేశపెట్టాలి. దానివలన రైతుకు తక్కువ ధరకే ఎరువులు, వ్యవసాయ పరికరాలు పొందుతాడు. మరియు సంఘం వ్యాపారం చేస్తుంది. మిగులు వస్తుంది. అప్పుడు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాలు, క్రిప్కో, ఇఫ్కో, మార్క్‌ఫెడ్‌ల వ్యాపారం పెరుగుతుంది.

**6. డైరీ వ్యవస్థను పటిష్టం చేయాలి:** రాష్ట్రంలో పాలసహకారసంఘాలు, జిల్లా యూనియన్‌లు సమతుల్యంగా అభివృద్ధి చెందలేదు. వెనుకబడిన జిల్లాలలో సహకార డైరి వ్యవస్థ అభివృద్ధికి నిధుల కేటాయింపు అత్యావశ్యకము. ఈ డైరీ వ్యవస్థలో కూడా ప్రవేటు వ్యక్తులకు లబ్ధిచెందే విధంగా, సహకార డైరీ వ్యాపారక్షేత్రాలను వారికి ధారాదత్తం చేసే విధంగా ప్రభుత్వ విధానాలు కొనసాగాయి. ఇవి సమీక్షించబడాలి.

**7. చేనేత కార్మికులకు పని కల్పించాలి:** "అప్పెరల్ పార్క్స" ఏర్పాటుద్వారా, చేనేతరంగానికి చేయూతనివ్వవచ్చన్న ధోరణి ఈ ప్రభుత్వంలో కూడా వ్యక్తమవుతుంది. ఇదే పూర్తి పరిష్కారము కాదు. ఈ పార్క్‌లద్వారా పట్టణప్రాంతంలో చేతివృత్తిదారులకు పని దొరుకుతుంది. అంతేకాని గ్రామాలలో చేనేతకార్మికునికి పని దొరకదు. చేనేత ఉత్పత్తి వ్యయము తగ్గించుటకు ప్రొడక్షన్ రిబేటు ఇవ్వటం ఓ మార్గం. ఈ విధానంచే చేనేత ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుంది. తద్వారా చేనేత కార్మికులకు పని దొరుకుతుంది. ప్రభుత్వం ఈ దిశలో ఆలోచించాలి.

పైన పేర్కొన్న చర్యలను రాష్ట్రప్రభుత్వము తీసుకోవడము ద్వారా తాము ఆశిస్తున్న రైతుసంక్షేమ ప్రభుత్వముగా స్థిరీకరింపబడుతుందని మనవి చేస్తున్నాము.

సహకార ఉద్యమ సేవలు

S. Bhoom...

**(సంభారపు భూమయ్య)**
కన్వీనర్
రాష్ట్ర కన్వీనింగ్ కమిటి
**సహకార సంరక్షణ సమితి**

Scanned by CamScanner